



కళ్ల ముందు త్రీడీ ప్రపంచం కనిపించడం, వర్చువల్‌గా త్రీడీ లోకాన్ని చూడటం, వస్తువుల్ని త్రీడీ ప్రింటింగ్‌లో సృష్టించడమే కాదు... ఇప్పుడు ఉంగరాలూ త్రీడీ తరహాలో రూపుదిద్దుకుంటున్నాయి. అంగుళీకాల్లో అమరే ఏనుగులూ, చిలుకలూ, నెమళ్లను ఏకంగా త్రీడీ బొమ్మలా పైకి వచ్చేలా తీర్చిదిద్దుతున్నారు డిజైనర్లు. 'త్రీడీ ఫింగర్ రింగ్స్'...ఇప్పుడు ఉంగరానికి కొత్త సింగారం!

# రింగ రింగా బొమ్మ ఉంగరంగా!





రోజు వారీ ఆభరణాల్లో అగ్రస్థానం అంగుళీకానిదే. పెద్దగా నగలని ఇష్టపడని వాళ్లు కూడా ఉంగరాన్ని గారం చేస్తారు. నాజూగ్గానైనా సరే ఆ నగను అభిమానంగా ధరిస్తారు. ఇక, ఇప్పుడు స్టేట్‌మెంట్ రింగ్‌ల కాలం నడుస్తున్నది. ప్రత్యేక సందర్భాల కోసం, విభిన్నమైన దుస్తుల మీదకి ధరించే ఉంగరాలు పెద్ద సైజులో, రంగులూ, రాళ్లతో చూడగానే ఆకట్టుకునేలా కనిపిస్తాయి. పట్టు చీరల మీదికైనా, వన్‌పీస్‌ల పైకైనా స్టేట్‌మెంట్ రింగ్ డిఫరెంట్ లుక్ ఇస్తుంది. అందుకే ఇవి అన్ని వయసుల వాళ్లనూ కట్టిపడేస్తున్నాయి. వాటిలో విభిన్నంగా, ఇప్పుడు త్రీడీ ఫింగర్ రింగ్స్ అబ్బుర పరుస్తున్నాయి. అదాటున చూస్తే వేలి మీద ఏదో బొమ్మను నిలబెట్టినట్టుగా కనిపిస్తాయి. అందులోనూ జంతువుల బొమ్మలను ఇందులో ప్రత్యేకంగా రూపుదిద్దుతున్నారు. కెంపులూ, పచ్చలూ, వజ్రాలూ పొదిగిన ఏనుగులు, చిలుకలు, నెమళ్లు ఇందులో ఉంటున్నాయి. ప్రతిచోటా విభిన్నత్వాన్ని కోరుకునే వాళ్లకోసం ఊసరవెల్లులూ, కప్పల్లాంటివీ వీటిలో కనిపిస్తున్నాయి. బంగారమే కాదు, వెండి, ఫ్యాన్సీ, రబ్బర్ జువెలరీలో కూడా ఈ త్రీడీ బొమ్మలు కనువిందు చేస్తున్నాయి. ప్రఖ్యాత నగల దుకాణాలతో పాటు అమెజాన్ లాంటి ఆన్‌లైన్ సైట్లలోనూ లభిస్తున్నాయి. మన అభిరుచిని బట్టి నచ్చినవి ఎంచుకుంటే, మనం కూడా త్రీడీ ట్రెండుకు తగ్గట్టు అప్‌డేట్ అయిపోయినట్టే. సరికొత్త స్టేట్‌మెంట్ రింగ్‌తో మనదైన స్టేట్‌మెంట్ ఇచ్చినట్టే!

